పెద్దకథ

# అచ్చిరాని మేడలో—

పార్వతి

పూర్వం—అంటే యిక్ష్వాకుల నాడుకూడా — వేదాంతులు, పండితోత్తములు ఎప్పుడైనా అబద్ధమాడాల్సివచ్చి, అన్యాయం చేసేందుకు కూడా అంగీకరించి వుండేవారేమో కాని, నేను చెప్పబోయే ఆసామీ—అంటే సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ద్వితీయ పుత్రుడు—మాత్రం అలాటివి చేసి ఎరుగడు. కానైతే తను చేసే వుద్యోగంలో యింతో అంతో లంచాలుపట్టడానికి అవకాశం ఉన్నా ఏమీ సంకోచించకుండా చెప్తూండేవాడు. "చూశారూ, నాన్నగారు యిల్లూ వాకిలీ ఏర్పాటు చేసిపోయారు. రోజల్లా కష్టపడి నడుంవంచి చేస్తే నెలాఖరుకి గౌరవంగా సర్కారువారు ఓ వంద పది రూపాయలు దిమ్మరిస్తుంటిరి. ఇక నేను అలాటి అఘాయిత్యపు పనులు ఎందుకు చేయాలి చెప్పండి!" ఈమాట పక్కనించి రాజమ్మ వింటూనేవుంది. భర్తమాటలు ముగ్గని పెట్టుకుని మింగకుండా అట్టే పెట్టుకుంది. దానికి అనుగుణంగానే భర్త గదిలోకి రాగానే మొదలెట్టింది: "మీరు చెప్పేనీతులుకైతే ఏమీ తక్కువలేదు కాని, ఎలా నడవాల్సిన బాటలో అలాగే నడవాలి. ,ఏదో ముళ్ళు గుచ్చుకుంటే గుచ్చుకుంటాయి, నేను నా మార్గాన్ని విడువనని అందరితోటీ చెప్తే వాళ్ళు నమ్మర్దూ! ...యీ కాలంలో అలాటి లంచాలు తిననివాళ్లెవరూ?... క్రితంనెల అన్నయ్య నాచేతిలో పాతికపెట్టి చీర కొనుక్కోమంటే అవికూడా యీ సముద్రంలో కలిపేసి కాళ్ళు చాచుకుని కూర్చున్నాను...." అంది పిల్లదాని ఒళ్ళు తుడుస్తూ. గణపతిరావు మంచంమీద కూర్చుంటూ భార్యమాటలేవీ వినకుండానే పెద్దపిల్లని కేకేశాడు "లీలా! కాస్త మంచినీళ్లు తీసుకురా తల్లీ!" అని. లీల గబగబా కాఫీ గ్లాసు, పళ్ళెంతో జంతికలు, తీసికెళ్ళి యిచ్చింది. లీల తల నిమురుతూ "నాకు తెల్సు... యింటికి రాగానే లీల కాఫీగ్లాసు యిస్తుందని... ఏమే రాజ్యం! మన లీల అత్తారింటికి వెడితే నాకు కాఫీ ఆ చంటిది తప్పించి ఎవరూ యిచ్చేవారు లేరు. నువ్వు చూస్తే యిదేవిధంగా సాధిస్తావు..." అని నవ్వాడు.

రాజమండ్రినుంచి ఎవరో రిటైర్ అయిన జడ్జీ గారుట, జవానును వెంటబెట్టుకుని చేతికర్రతో వచ్చారు. గణపతిరావు గబగబా పైమీద ఖాండువా వేసుకుని కబురు తెలిసింది తడవుగా వీధిలోకి వచ్చాడు.

"మీరేనా గణపతిరావుగారు!...మీయింటి వెనుక మేడగురించి మీకేదో తెలుసునని చెప్పారు. అదేదో అడిగి తెల్సుకుందుకు వచ్చాను."

"ఆ మేడ గురించి యీ వీధివాళ్ళకు ఎంత తెలుసో, నాకూ అంతే తెలుసు ననుకోండి. కాని అందులో దిగటానికి ఎవరూ రాకపోగా, అమ్మితే దమ్మిడీకికూడా ఎవరూ కొనని మాటమాత్రంనిజం."

"మీరు చెప్పేమాట విచిత్రంగావుంది గణపతి రావుగారూ! ఇరవై ముప్పైవేలు ఖర్చుచేసి కట్టించిన మేడకి ఏమొచ్చి పడింది?"

"మీరు యింతసేపూ నిల్చునే మాట్లాడుతున్నారు. ఈ చాపమీద కూర్చోండి. మా అమ్మ వేపు బంధువు లెవరో వ్యాపారంమీద కొన్ని లక్షలు గణించి యీ వూళ్ళోనే, అవసానదశలో ఈ మేడ కట్టించి మూడేళ్ళ కాబోలు వున్నారు. గృహప్రవేశం అయిన వారానికల్లా చిన్నకోడలు, పెద్దకోడలు, యిద్దరు పిల్లలు, వరుసగా పెద్దమ్మ వారొచ్చి చనిపోయారు. మరో మాసానికల్లా యింటాయన గుండె ఆగి చనిపోయారు. ఇదంతా యిలా వుండగా యింట్లో ఏదోవిధంగా అందరూ అస్వస్థతగానే వుండేవారు. పెద్దలంతా యిల్లు వారి నక్షత్రానికి సరిపోలేదని చెప్పారుట. దాంతో వారు ఆ యిల్లు అమ్మమని మా అందరికీ చెప్పి రాజమండ్రిలో స్థిరపడి పోయారు..."

"మీరు ఏది ఎలావున్నా, యీ యింటికి ఎంత రొక్కం యివ్వాలసివుందో కనుక్కొని నాకు రాయండి. నాకు వెంటనే మాత్రం అందాలి."

"ఇదంతావిని, మీరు మళ్ళా అదే అంటున్నారే!..."

"ఆఁ!...సింగినాదం! మనుష్యుల శరీరతత్వాల్ని బట్టి కాని, యింటినిబట్టి, నక్షత్ర చెరుపుల్ని బట్టి రోగాలు రావండి గణపతిరావుగారూ! ఏ శాస్త్రాలు నీతులు చెప్పిందే ఆ బ్రాహ్మలు డబ్బు లెలా ఒడుకుతారు చెప్పండి! నాకు మాత్రం తొందరలో తెలియపర్చండి." అని మాట విన్పించుకోకుండా వెళ్ళిపోయారు. మనిషైతే ఏమంత రంగులేదు కాని నెరిసిన జుట్టు ముఖకవళికబట్టి చూస్తే అరవై ఏళ్ళు పైబడినట్టు మాత్రంలేదు. ఆ నడకలోకాని, మాటలోకాని ఏమాత్రం గంభీరం చెడలేదు. ఫ్లాస్కో జరీపంచ, సిల్కుచొక్కా, పైన జరీ గోరంచు ఖండువా ..

రాజమ్మ యీ మాటలు వినేసరికి చకితురాలయింది.

"అయితే ముసలాయన యిల్లు పుచ్చుకుంటారన్నమాట! ఈ యిల్లు అమ్మి పెడితే ఆవిడ నూట యేభయి కమీషను యిస్తానన్నదిటగా! అదేదో తేలితే పిల్లదాని మెళ్ళో గొలుసు వేయొచ్చులెండి." అంది భర్తకేసి చూసి నవ్వుతూ. గణపతిరావు మొహం పక్కకు తిప్పుకుని "ఇలాంటి పనులు చేసేధైర్యం నాకు మాత్రంలేదు. పిల్ల దాని యోగం బాగుంటే అలాటి గొలుసులు అవేవస్తాయి" అన్నాడు. కాని భార్యమాటమీద కోపం మాత్రం రాలేదు. అలాటి పని తన భావాలకి వ్యతిరేకమయినా, అందులో తల్లి యొక్క అత్యంత ఆతురత, ప్రేమ, అభిమానం సర్వంకూడా నిండుగా ప్రవహిస్తూనే వున్నాయి. తనుమాత్రం ఏం చేయగలడు?

* * *

జడ్జీగా రిటైరైన సర్వేశ్వరరావుగారు వెనకవైపు మేడ కొనుక్కొని దిగారు. వచ్చీరావటంతోనే సర్వేశ్వరరావుగారి భార్య జానకమ్మ లీలని బాల్చీ అడిగిపుచ్చుకుని రాజమ్మతో అంది, "ఒదినగారూ! ఆ యింట్లో కుళాయిలు పెట్టించినా యింకా వేసేందుకు వీలుకాదుట. నూతి నీళ్ళు నాచుపట్టాయి. ఈ రెణ్ణాళ్ళూ మీ నూతి నీళ్ళు వాడుకుంటాము..." అనటంతోనే రాజమ్మ బాల్చీలు, బిందెలు యిచ్చింది తోడుకునేందుకు.

ఇదేవిధంగా యిద్దరి యిళ్ళవాళ్ళకీ నాల్గు రోజుల్లో చాలా స్నేహం కలిసింది. జానకమ్మ గారి ఏకైక పుత్రుడు సోమసుందరబాబు యిప్పుడు యింటర్ రెండోసంవత్సరం కాబోలు చదువుతున్నాడు. కూతురి పిల్లలు నలుగురూ (యిద్దరు ఆడపిల్లలు యిద్దరు మగపిల్లలు) అమ్మమ్మా తాతా దగ్గరే వుంటున్నారు. వుంటున్నారని చెప్పటమే కాదు వుండితీరాలికూడా. కాకపోతే మరెవరు దిక్కు? తల్లిపోయి నాల్గుసంవత్సరాలు కాబోలు అయింది. తండ్రి వెంటనే ద్వితీయం చేసుకున్నాడు. ఈ అనాథ పిల్లల్ని చూస్తూ అలాంటి తండ్రి చేతులో ఎలావుంచగలరు! పైగా బతికున్న ఆరేళ్ళు కూడా ఒకేవిధంగా కూతురు కష్టపడింది. లోకానికైతే జడ్జిఅయి తీర్పులుచెప్పి పెద్దపెద్దకేసుల్ని సరిచేస్తారేకాని, సర్వేశ్వరరావుగారు అల్లుడిని అదుపులో పెట్టలేక పోయారు. కూతురు కంట తడిపెట్టుకుని తల్లితో అంది, "నా బతుకు ఎలాగూ కాలిపోయింది. డబ్బునిచూసి ఎప్పుడూ మోహపడకూడదమ్మా! తమ్ముడికైనా మంచిచదువు చెప్పించి మంచిగుణంగల కోడల్ని తెచ్చుకుని ఆనందించు..." అని అనేసరికి తల్లి కూతుర్ని కౌగలించుకుని "నా రెండుకళ్ళు బాగుంటేనే దృష్టి అనేది తల్లీ!...కన్ను, ఎంతచెడినా దానికి ఆపరేషన్లు అవి ఎలా మానగలనమ్మా... యింక యీకన్ను బాగుపడదు. ఇందుకు విధాత ఏ డాక్టర్నీ సృష్టించనుగూడా లేదు..." అంది. జానకమ్మ తన యిద్దరు పిల్లల్నీ తన కళ్ళతో పోల్చి చెప్తూండటం మామూలు...

జానకమ్మ పిల్లలమధ్యగా పీటవేసుకుని అన్నం గరిటతో వడ్డిస్తోంది. లీల గుమ్మంలోనుంచుని అంతా చూస్తోంది. యింతవరకూ లీలని ఆవిడ చూడనే లేదు. సుందరబాబు పక్కకిచూసి తల్లితో నెమ్మదిగా అన్నాడు, "వాళ్ళ లీల ఎందుకో వచ్చిందమ్మా..." లీలకి ఈ మాట అతిస్పష్టంగా విన్పించింది. సిగ్గుతో తలదించుకుని తలుపుచాటుకెళ్ళి నిల్చుంది.

"రావే లీలా!...సిగ్గు పడటానికి యిక్కడ కొత్తవాళ్ళెవరూ లేరులే. సుందరబాబు వున్నాడు వాడు రోజూ వుండేవాడే" అని అనే సరికి తల్లికేసి కొరకొరా చూశాడు. లీల గ్లాసు ముందుకు తోసి నెమ్మదిగా అంది, "యివాళ పాలన్నీ విరిగి పోయాయి చెల్లికి కాసిని పాలు పోయమంది" అంది. జానకమ్మ తొంగిచూసి "నేను అంట్లు చేతిని కడుక్కుని లేవాలే మరి! నువ్వు నెమ్మదిగా దాలిలో వున్న కుండను వంచుకో" అని అంది. ఎంతో స్వతంత్రంగా లీల పరికిణీ కుచ్చెళ్ళను దగ్గరకు పట్టుకుని పాలు నెమ్మదిగా నింపుకుంది. ఎంతసేపూ జానకమ్మ, పిల్లదాని తెలివిని పరీక్షిస్తోనే వుంది. లీల వెళ్ళగానే అంది "పిల్ల చూడ్డొస్తే పన్నెండేళ్ళదయినా మంచి నెమ్మదస్తురాలు, నేర్పరీను" అని అంటూండగానే యింటాయన మధ్యలో ప్రశ్నించారు "ఎవరు జానకీ?"

"అదుగో వారి పిల్ల, లీల. మంచి పనిమంతురాలు" అంది విసుగు లేకుండగా ముసలాయన కాళ్లు చేతులూ కడుక్కుని భోజనానికి సిద్ధపడ్డారు సుందరబాబు తండ్రితో అంతగా మాటలాడింది లేదు కాని ఈమధ్య రెండేళ్ళనుంచి ఇంటిదగ్గరే వుండటంచేత కాస్త భయం తీరింది. అలా అయినా కూడా తనకి కావలసినవన్నీ తల్లి నోటి మీదుగా అడిగి తీర్చుకుంటూంటాడు. సుందరబాబు తల్లికేసి చూసి నవ్వి తల దించుకున్నాడు. ఇలాంటి పరిస్థితి రాగానే తండ్రికి అవగాహన అవుతూనే వుంటుంది.

"సుందరబాబుకి ఈ సెలవుల్లో మెడ్రాసు, బెంగుళూరు వెళ్ళాలని సరదాగా వుందిట. రేపు వారంనుంచే మొదలుట సెలవులు. మీ ఆర్డరుకోసం ఎదురుచూస్తున్నాడు."

"ఒక్కడూ వెళ్ళిరావటం పడదు. వాడితో నువ్వూ వెళితే సరి."

"మరి వంటో? మీకు నేతప్ప యింకెవరు వండిపెట్టినా నచ్చదని విసుక్కుంటారుగా!"

"బాబుకన్నా నేనేమంత ఎక్కువలే నీకు" అని నవ్వారు. భార్యతో మాట్లాడే కాలంమటుకు ఎంతుంది? అంతా పోగుచేస్తే రోజుకు గంటకి మించి వుండదు. అది రాత్రీ, పగలూ, భోజనవేళలోనే. ఈ సమాధానం విని చడిచప్పుడు లేకుండా మేడ ఎక్కాడు సుందరబాబు.

ఇంటి పూర్వచరిత్ర విని ముసలాయన ఏమంత తర్కించుకుని చూసుకోలేదు. కాని భార్య జానకమ్మ మేడలోకి వచ్చిననాటి రాత్రి నిద్రలేకుండా పడుకుంది. ఈ మాట పైకి అంటే భర్త చాలా కోపగిస్తారు. పైగా యింట్లో పూజలు, దేవుడు ఈ నమ్మకాలంటేనే చెడతిడతారాయె. ఇలాటి పట్టింపు మాటలు తర్కిస్తే అసలే తప్పు కూడా. అందుచేత నోరు మెదపను కూడా ధైర్యం చాల లేదు. నెల్లాళ్ళయేసరికి ముసలాయన నలతగా పడుకున్నారు. చల్లగాలికి కాస్తంత రొంప దగ్గుమాత్రం పట్టింది. కాని ముసలాయన లన్నట్టుగా శరీరతః అస్వస్తతగా వున్నా, గాలిధూళి పేర్లు పెడుతూనే వుంటారు. ఈ మాట పక్క గదిలో రాజమ్మతో అనేసరికి విని పిల్చారు, "జానకీ! నీకు అంతగా భయంగా వుంటే గణపతిరావు నడిగి గది తీసుకుంటూ, అందులో వుండొచ్చు. అంతేకాని. నా ఎదురుగా యిలాటి మాటలు మాత్రం ఎత్తొద్దు." అన్నారు కోపంగా. జానకమ్మ కలదించుకుని వూరుకుంది.

* * *

ఏడాది ఈ మధ్యలో ఏ మార్పులూ జరగలేదు. సుందరబాబు పైచదువుకి విశాఖపట్నం వెళ్లేడు. ముసలాయన తను వున్నంతకాలం యింట్లో ఎవరికీ అద్దెకు యివ్వనని చెప్పారు. దొడ్లోమటుకు పాకలో పాతనౌఖరు నేరేళ్లుకి మాత్రం స్థానం యిచ్చారు. నేరేళ్లు కుటుంబం ఉన్నంతలో తిని అయ్యగారి నౌఖరీ చేసుకుని బతికిపోతున్నారు.

ఒకనాడు హఠాత్తుగా వున్నట్లుండి గణపతిరావు జడ్జీగారింటికివచ్చి ఆయన్ని పిల్చాడు.

"ఓ!...మీరా!...రండి గణపతిరావుగారూ! మీకన్నా నాకు ఈ వాడలో బంధువులు, స్నేహితులు మాత్రం ఏరీ?..." అని నవ్వారు. గణపతిరావు కుర్చీలో కూర్చుంటూ "నేను మీకన్నా అన్నింటిలోనూ చిన్నవాడిని. మీరు నన్ను నువ్వు అని సంబోధించాలిగాని లేకపోతే నేను చాలా బాధపడ్తాను." అన్నాడు. వెంటనే జడ్జీగారు "నువ్వేదో ముఖ్యవిషయం మాట్లాడేందుకు వచ్చా

వల్లేవుండే. లేకపోతే యిటువంటి ఆఫీసుటైములో రావటం ఎలా పడ్తుంది?" అన్నారు.

"మాయింటాయనకి ఈవూరు బదిలీ అయిందిట. నాకిప్పుడు వుత్తరం వచ్చింది నన్ను ఎల్లుండిలోపు యిల్లు ఖాళీచేయమని. మీరేదో పెద్దవారు నాకు ఆశ్రయం యిస్తే యింతలో యిల్లు వెతుక్కుని పోతాంలెండి." అని అన్నాడు జాలిగా.

ముసలాయన ముందుకువంగి అన్నారు నెమ్మదిగా "మాకింత యిల్లు అవుసరంకూడా లేదనుకో, మీరు నిరభ్యంతరంగా మా యింట్లో ఒక వాటా తీసుకుని వుండొచ్చు, దానివల్ల మేమునష్టపోయేది మాత్రం ఏముందిలే! మీవల్ల మాకు సాయం వుంటూనేవుంది. ." అన్నారు.

గణపతిరావు లేచి రెండుచేతులూ జోడించి కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు, "మీ దయ వల్ల మేము బతికిపోతున్నాం...ఆ భగవంతుడు మీ నోటివెంట ఈమాట అన్పించకపోతే నేను నవ్వులపాలు కావాల్సిందే..."

"అయితే మనం చేసిన ప్రతిపనీ, దైవనివేదనతోనే గడుస్తుందంటావా? ఏదీ, ఆ దేముడంటూ వుంటే కన్పర్చమను ఏ భక్తుడ్నయినా...కర్తవ్య సాధన మన తెలివి, బుద్ధివికాసం బట్టి వుంటుంది గాని, అది దైవనిర్ణయం మాత్రంకాదని తెలుసుకోవోయి!" అని లేచారు.

జానకమ్మ ఈ మాటవిని మనసులో ఏమనుకుందో కాని పైకి మాత్రం అట్టే తేలలేదు.

"వాళ్ళు మళ్ళీ యిల్లు చూసుకుని వెళ్ళిపోయేట్టుగానే ఏర్పాటయిందా?"

"నా నోటితో నేనేది ఏర్పాటు చేయలేదు జానకీ! ఏదో, ముగ్గురు పిల్లలతో వున్నాడు. వాళ్ళ స్వంత వూర్లో ఏవో కొంపా గోడూ వుందిట. ఇక్కడ వుద్యోగమయి యిలాఅవస్థ పడ్తున్నాడు. నువ్వు ఏ సాయంలేకుండా వున్నావు. అందుచేత వాళ్లు ఎంతకాలం వుంటే అంతకాలం వూరికినే ఆ పక్కవాటాలో వుంచుదాము." అని అన్నారు పచార్లు చేస్తూ.

"మరి యీ సంగతి ముందే తెలిస్తే ఎవరికైనా పాతికముప్ఫై రూపాయలు అద్దెవచ్చేదిగా!"

"పోదూ వెధవడబ్బు నిలువెత్తు ధనం పోస్తే మటుకు మంచి మనుష్యులు, పెద్దమనుష్యులు దొరకొద్దూ! నా కెప్పుడూ డబ్బు విలువతో సంబంధ బాంధవ్యాలు ముడిపెట్టటం యిష్టముండదు. పాపిష్టి డబ్బు డబ్బుకి, బాంధవ్యానికి ఏమాత్రం సంబంధంలేదని మీ ఆడవాళ్ళంతా ఒప్పుకుంటే ప్రపంచకంలో ఇన్ని అనర్థాలు, అక్రమాలు జరగకపోను." అన్నారు. జానకమ్మకి ఆ మాట ఏమంత కొత్తకాదు. ఇల్లు అద్దెకు యివ్వవద్దన్న తరువాత యీ ఏర్పాటు ఎందుకు జరిగిందో తనకు మాత్రం అంతు తెలీలేదు. పైగా పెద్ద ఆస్తి, వృత్తి వుద్యోగాల్ని చూసి యిచ్చిన కూతురు సంసారం కుప్పలా కూలిననాటి మంచీ ముసలాయనకి డబ్బుమీద, పాతనమ్మకాల మీద మరి కాస్త అపనమ్మకం వచ్చిపడింది.

"మీ తీర్పుకి నేనెక్కడ ఆగగలను లెండి... మీ కిష్టమైతే అన్నీ అవునంటారు. ఇంతకీ ఆడవాళ్ళు గ్రహించినంత విశదంగా మగవాళ్ళు ముందు పరిస్థితున్ని ఆలోచించలేరు. వాళ్ళు యింట్లో వచ్చి వుండటంవల్ల డబ్బుకాని యిల్లుకాని ఏమీ నష్టపోదు. ఆ పైన వచ్చే కష్టనష్టాలు మాత్రం మనతో చెప్పిరావు. అది మాత్రం మీకు ఒకప్పటికైనా గ్రహింపులోకి రాకమానదు." అని వెళ్ళిపోయింది. ఈ మాటలలో ప్రతి ముక్క తూచి చూస్తే వీసెత్తు బరువైనా తూగుతుంది. కాని సర్వేశ్వరరావుగారు పదేళ్లు జడ్జీపని చేసి నేర్చుకున్న లోకజ్ఞానం, సంఘీభావాల్లో అలాంటివి తట్టనే తట్టవు.

నేరేళ్లని బతిమాలుకుని గణపతిరావుగారు సామానంతా చేరవేసుకున్నారు. రెండుగదులూ వెనకవేపు వసారా, చిన్న కొట్టుగది. పెరడు మాత్రం అంతా ఏకంగానేవుంది. గదులు వీధివైపుకే వున్నాయి.

* * *

నేరేళ్ల కూతురు కన్నమ్మని పిల్చింది లీల. అప్పటికి ఆపిల్ల చిన్నగుడ్డొకటి మొలకి చుట్టబెట్టుకుని తల్లిపక్కగా కూర్చుంది. లీల పిలుపువిని పరిగెత్తుకుంటూ వచ్చింది. పైగా లీలపిలుపు అమృతంలాకూడా విన్పిస్తుంది దాని చెవులకి. ఎప్పుడు పిల్చినా ఏదో పిండివంటో, లేక బటానీలకి కాణీయో యిస్తూనే వుంటుంది. ఇమాటు పిల్చి

అంతకన్నా పెద్దబహుమానమే యిచ్చింది. తన చెల్లెలు జాకెట్టు పరికిణీ యిచ్చి 'ఏయ్‌కన్నమ్మా! యీబట్టలు కట్టుకో. మళ్ళా ఇంకోజత యిస్తాను" అంది. దాని తల్లి యీమాట విని "అమ్మాలీలమ్మగారూ!...మీరు యివ్వటమే కాదు, దాన్నికట్టుకోకపోతే కొడతానని చెప్పండి. మా పెద్దమ్మగారు వెనక ఇలాగే మూడుజతలు కుట్టించి యిచ్చారండి అమ్మాయిలతో పాటు. అది వట్టి పొగరుపోతుదమ్మా!...యిష్టమయిననాడు కట్టుకుంటది లేనినాడు లేదు" అని నవ్వింది. లీల నవ్వుతూ లోపలికెళ్ళిపోయింది.

లీల యిప్పుడు చాలా పెద్దమనిషితనం నేర్చుకుంది. ఇంట్లోకొచ్చి ఆర్నెల్లు పైబడ్డా యింటివాళ్ళకు ఏవిధమైన కష్టం కల్గించలేదు. ఆమధ్య జానకమ్మగారు రెండురోజులు లేవలేకపోతే లీల వండిపెట్టింది. అలాని రాజమ్మ పంపింది. "వారి వల్ల మనం గంపెడు ఉపకారం పొందుతున్నాం లీలా!...మళ్ళా మనమూ ప్రత్యుపకారం ఏదో విధంగా తెల్పుతూనే వుండాలి." ఈ రెండు రోజుల్లోనూ ఎవరికే కూరయిష్టమో అన్నీ తెలుసుకుంది. ముఖ్యంగా సుందరబాబుకి కారంవేసిన కూరలుకాని, పచ్చళ్లుగాని కిట్టవు. లీల తెలీక అలవాటు ప్రకారం పులుసులో కారం మస్తుగా వేసింది. వడ్డన సమయంలో జానకమ్మ దగ్గర కూర్చుని అన్నీ చెప్పి చేయించింది. సుందరబాబు అన్నం తిని "ఈ పులుసు ఎవరు చేశారమ్మా? ఏదో నాలుగు రోజులు వుందామని వస్తే నా అంతు కనుక్కునేటట్టున్నారే?" అన్నాడు లీలకేసి చూసి. లీల యీ మాటకు తల దించుకుని అంది నెమ్మదిగా "మా యింట్లోలా వేశాను, యికపైన అలా వేయనులెండి" అని అంది. సుందరబాబు మొహమెత్తి చూశాడు. లీలని యిన్నాళ్ళు చూసినట్టు మాత్రం చూడలేదు. ఈవాళ యీ క్షణంలో తనమటుకు తను ఏ దేవతనో చూస్తున్నాననుకున్నాడు. నలుపైతే ఏంగాని లీల నిండా ఐదడుగుల పొడుగు, పొడుక్కి తగ్గ లావు వుంది. కనుముక్కు తీర్చి దిద్దినట్టుంటాయి. వెనక్కి తిరిగితే మోకాలుకంటే జడ.

"పోనీలేరా, పాపం దానికి చేతయినట్టు వండి పెట్టింది. నువ్వంటే అది భయపడుతూనే వుంటుంది. మొన్న వాళ్ళ అమ్మ చెప్పింది నువ్వ క్రితం మాటు వచ్చినప్పుడు నామీద కేకలేస్తే తల్లితో అందిట — సుందరబాబుకి లోకువ కనక జానకి అత్తయ్యమీద కేకలేస్తాడు కాని మామయ్యగారిని పల్లెత్తు మాటయినా అనడు—అని అందిట." ఈ మాటకి సుందరబాబు మరి కాస్త సిగ్గుపడిపోయాడు.

లీల కిప్పుడు పధ్నాలుగేళ్ళు దాటాయి. మనిషిని చూసి అందరూ యిర్వైఏళ్ళు ఉంటాయంటారు. ఒకరోజు సర్వేశ్వరరావుగారు, గణపతిరావుని పిలిచి చెప్పారు "ఏం, గణపతిరావూ! లీలకి ఏ విధంగానూ చదువూ సంధ్యా చెప్పించకుండా కూర్చోపెడతావన్న మాట. శరీరానికి వస్త్రాలు ఆభరణాలతో పాటు బుర్రకి చదువు కూడా సంస్కారమన్న విషయం ఎందుకు గుర్తించుకోరూ!" అని అన్నారు కోపంగా. గణపతిరావు నేలవైపు చూస్తూ అన్నాడు, "ఏదో సంబంధాలు చూడాలని అనుకుంటున్నాను. ఇల్లు భూమి అమ్మి ఆడబ్బుతో పెళ్ళిచేయాలి. అందుకే యీ రెండు రోజులూ వూరు వెళ్ళి మాటలాడి వచ్చాను. పైగా ఆ యిల్లు మా అన్నయ్యా నేను పంచుకోగా ఇద్దరికి చేరొక రెండు వేలకి మించి రాదు. రెండువేలకి ఎంత విలువగల మనిషిని తేగలనో తెలుసు కదా మీకు!..." ఈమాట అనటంలో ఎంతబాధ పడ్తోన్నదీ ముఖాన్నిబట్టి గ్రహించగల్గారు ముసిలాయన. ఇదంతా పుస్తకం చదువుకుంటూ సుందరబాబు విననే విన్నాడు. ఆ మాటమీద తనకేదో దెబ్బతగిల్నట్టు బాధపడ్డాడు.

* * *

లీల యింటిపనుల్లో ఎంతో మెలకువగా వుంటూంటుంది. చెల్లాయిని మటుకు వీధిబడికి పంపుతున్నారు. తమ్ముడిని ఏడవకుండా వూరుకోబెట్టటం, యింట్లోపనితోను శ్రాద్ధస్తమానం సరిపోతుంది. సాయంత్రం చక్కగా సింగారించుకుని తండ్రి బజారునుంచి తెచ్చిన ముత్యాలదండ కొత్తది పెట్టుకుని, తమ్ముణ్ణి తీసుకుని జానకమ్మగారిదగ్గరకెళ్ళి మాట్లాడుతుంది. రోజూ యీ కార్యక్రమం ఏమీ కొత్తగాదు. సుందరబాబు, అక్కకొడుకు శ్యాము చెవి పట్టుకుని ఈడ్చుకొచ్చి తల్లి ఒళ్ళో పడేసి నవ్వుతూ అన్నాడు,-

"చూడమ్మా వీడికి ఎ, బి, సి, డి లు దిద్దుకోమని నిన్నటినుంచి నాన్నా నేనూ చెప్తున్నా అర్థం కాకుండావుంది. పోయి జామిచెట్టు ఎక్కి కూర్చున్నాడు" అన్నాడు గుక్క తిప్పుకోకుండా. లీల చడీచప్పుడూ కాకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. తను మామూలుగానే సుందరబాబును చూసి భయాందోళన పడ్తుంది. ఎదుటపడి అతడిని ఎప్పుడూ చూడలేదు. వెనకాలేవచ్చి చెవిలో అన్నాడు "ఏం!—నీకూ భయమేసిందా? వాళ్ళని తిట్టినట్టు తిడతానని" అన్నాడు.

అసలు యిద్దరికీ అంత చనువుగుటుకు ఎందుకవాలి? వచ్చిన కొత్తలోలాగ సిగ్గు, బిడియాలలో వున్నా ఒకరోజు లీల శ్యాముని తన చదువు సంగతిసందర్భం కనుక్కుంటూంటే తను పక్కనించి వింటూనే వున్నాడు. డైవాత్తు యిల్లు ఒకటే అయిపోయింది. ఎంత చాటుచేసుకుని తిరిగినా ఒకే పంచగా! రాత్రి లీల నూతిదగ్గరకొచ్చి కాళ్లు కడుక్కుంటూంటే తను ఎదురుగా వెళ్ళి అడిగాడు "ఏం లీలా! నా సంగతి నాకన్నా యితరులకి ఎక్కువ తెలుసుంటుందని నమ్మకమా నీకు, లేక అదంతా సిగ్గా, భయమూనా?" అని అన్నాడు. లీల ముందు బెదిరిపోయిందికాని సుందరబాబు మొహంలోకి చూసి అంది తడుముకుంటూ "మాట్లాడే సంగతులులేక, వాడిని పల్కరిద్దామని అడిగాను."

"అయితే నా సంగతి నీకంత అనవసరమన్న మాట...సరే తెలిసిందిలే" అని విసురుగా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రల్లా లీల మనసు చాలా బాధపడింది. తెల్లవారితే సుందరబాబు ప్రయాణం. తనతో యింతచనువుగా ఎప్పుడూ మాట్లాడలేదు. ఇలాటి సమస్యలు ఒకరితో మాత్రం ఎలా చెప్తుంది? తెల్లవారాక సుందరబాబు మామూలు పనులకు కూడా దొడ్లోకి రాలేదు. రోజూ వీలున్నపుడల్లా పూల మొక్కలు చూసేవాడు. అందుకుకూడా రాలేదు. యింక దారీ తెన్నూ కన్పించలేదు తనకి. కన్నమ్మని పిల్చి అడిగింది "బాబుగారు ఏంచేస్తున్నారే?"

"బట్టలవీ సర్దుకుంటున్నట్టున్నారమ్మా...యీపాటికి అయిపోవచ్చునండి. మీరుచూసి రమ్మంటే చూస్తానమ్మా" అంది.

"ఆఁ, చూసి రా...ఎవరూ లేకపోతే నెమ్మదిగా అడుగు లీలమ్మగారి మీద కోపం వచ్చిందా అని అడుగు, ఉఁ త్వరగా రావాలి. నువ్వు వచ్చేంత వరకూ నేనిక్కడే వుంటాను." అని అంది ప్రాధేయ పడ్తూన్న స్వరంతో.

కన్నమ్మ పరిగెత్తుకుంటూ వెళ్ళి క్షణంలోవచ్చి పడింది. ఒగుర్చుకుంటూ అంది "అమ్మా! బాబుగారికి కోపం వచ్చినా పర్వాలేదన్నారు. అయినా కూడా చాలా కోపంగా వున్నారమ్మా."

'నీకెలా తెలుసు వారు కోపంగా వున్నారని?"

"ఆయనకి కోపమొస్తే ఎలావుంటుందో మాకు తెలీదా అమ్మా!...కావలిస్తే మీరే కనుక్కుని రండి..." అని వెళ్ళిపోయింది.

లీలకి యింక వెళ్ళటం మటుకు తప్పలేదు. మేడ మెట్లు పడకగది తలుపు తీయగానే ఎదురుగా వుంటాయి. కాని ఆ తలుపు ఎప్పుడూ తీసింది లేదు. తలుపు తీసుకుని గబగబా మేడ ఎక్కింది. మామయ్యగారు ఆఫీసు గదిలో ఎవరితోటో చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నారు లీలవెళ్ళి తలుపు చాటునుంచి సుందరబాబును అడిగింది:

"మీరు నా కబురు విన్నారా సమంగా? కోపంవచ్చిందా నిజంగా." సుందరబాబు పక్కగా వెళ్ళి అన్నాడు, "నేనడిగినదానికి సమాధానం సమంగా యివ్వకపోతే కోపంరాదూ? నీతో చెప్పలా, నాతో చనువుగా మాట్లాడాలని! ఇంకీ పైన నాతో సరదాగా మాట్లాడుతావా?..." అని లీల కళ్ళలోకి చూశాడు. లీల తలూపుతూ వెళ్ళిపోయింది. అప్పటికప్పుడే మొహం ఎర్రబడి కంట్లో నీళ్ళు తిరిగాయి. సుందరబాబు లీల అమాయికత్వానికి చాలా నవ్వుకున్నాడు. ఆదేవిధంగా తను విధించిన ఆజ్ఞప్రకారం లీల శిక్ష అనుభవించి ఎలాగైతేనేం, కొంచెం తలెత్తి మాట్లాడ్డం నేర్చుకుంది.

(ముగింపు వచ్చే సంచికలో)